క్లుప్తంగా

ఐటీఐ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

వేంపల్లె : స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి చారిటీస్ ఐటీఐలో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, 10వ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రసాదరావు తెలిపారు. ఐటీఐలో ఎలక్ట్రీషన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ప్లంబర్ కోర్సులు కలవని, జూన్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాలలో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విద్యుత్ అధికారులు

పులివెందుల రూరల్ : వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ శ్రీనివాసులు అన్నారు. బుధవారం అంబకపల్లె రోడ్డులోని డివిజనల్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గురుమోహన్‌రెడ్డి, ఏఈఓ విజయలక్ష్మి, విద్యుత్ యూనియన్ నాయకులు, పాల్గొన్నారు.

నేడు చక్రాయపేట మండలంలో ఎంపీ రోడ్‌షో

చక్రాయపేట : కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం చక్రాయపేట, నాగలగుట్టపల్లెలో ఎన్నికల ప్రచారం నిమిత్తం రోడ్ షో కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ విషయాన్ని మండల ఇన్‌చార్జి వైఎస్ కొండా రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు నాగలగుట్టపల్లెలో, అనంతరం చక్రాయపేటలో రోడ్‌షో ఉంటుందన్నారు. తర్వాత ఎంపీ మహదేవపల్లె గ్రామంలోని బొజ్జావాండ్ల పల్లెకు వెళతారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు,అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'కూచిపూడి'లో ఉచిత శిక్షణ

కడప కల్చరల్ : ఆర్యవైశ్యుల బాలబాలికలకు కూచిపూడి నృత్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ మహిళా విభాగం అధ్యక్షురాలు నాగ పుష్పాంజలి తెలిపారు. కడప అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న శిక్షణాలయంలో 5 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సుగల వారికి శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 10 నుంచి జూన్ 15 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 9వ లోపు దరఖాస్తు చేసుకోవాలని.. వివరాలకు 79812 70971 సంప్రదించాలన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

కడప కార్పొరేషన్ : విద్యుత్తు ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ కోరారు. కడప విద్యుత్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెగిపడిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండి సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఫిర్యాదు చేయుటకు టోల్ ఫ్రీ నెంబర్ 1912 వినియోగించుకోవాలని తెలిపారు. పొలాలలో ట్రాన్స్‌ఫార్మర్లకు కొంత స్థలం కేటాయించుకుని వాటి వద్దకు ఎవరూ వెళ్ళవద్దని సూచించారు. విద్యుత్ లైన్ల కింద బోర్లు వేయరాదని స్టార్టర్ తేమ ప్రాంతానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. తీగలు భూమి మీద కాకుండా ఎత్తులో కనపడే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో విద్యుత్ కంచె ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. సొంతంగా విద్యుత్తు మోటార్ల మరమ్మతులు చేసుకోకుండా అధికారులకు లేదా సిబ్బందికి తెలియజేయాలన్నారు.

పేదలకు అనుగ్రహం

- పేదల సొంతింటి కల సాకారం
- అందంగా జగనన్న కాలనీలు
- మౌలిక సదుపాయాలు కల్పన
- లబ్ధిదారుల్లో సంతోషం



ఎర్రిపల్లిలో పూర్తయిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు



సెంటు స్థలంలో జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు

పులివెందుల రూరల్ : ప్రభుత్వం పేదలను అనుగ్రహించింది.వారికి గూడు కల్పించాలన్నా ఉద్దేశంతో సొంతిల్లు లేని అర్హులందరికీ ఇంటిం స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసింది. దాదాపు ఒక్కో కుటుంబాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు స్థిరాస్థిపరులను చేసింది. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించింది. ఫలితంగా పేదల సొంతింటి స్వప్నం నెరవేరింది. సొంతగూటికి చేరిన లబ్ధిదారులు చెప్పలేనంత ఆనందం పొందారు.

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని జేఎన్టీయూ కళాశాల సమీపంలో సుమారు 7500 ఇళ్ల 250 ఎకరాల్లో జగనన్న కాలనీ పేరుతో హౌసింగ్ కాలనీ నిర్మిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. అలాగే పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, ఎర్రిపల్లె, తుమ్మలపల్లె గ్రామాల్లో జగనన్న కాలనీలు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొందరు ఇళ్లలో నివాసం ఉంటున్నారు. ఈ కాలనీలను దూరం నుంచి చూస్తుంటే ఊర్లుగా కనిపిస్తున్నాయి. నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీల్లో పేదలందరికీ గృహాలు పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలంలో ప్రతి ఇంటి నిర్మాణం కోసం రూ.1.80లక్షలు అందజేశారు. అలాగే ఇసుక ఉచితంగా ఇవ్వడంతో పాటు ఇంటికి కావాల్సిన సిమెంటు, నిర్మాణ సామగ్రిని రాయితీపై అందజేశారు. దీంతో హౌసింగ్ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



మండల పరిధిలోని ఎర్రిపల్లి గ్రామంలో అద్దె చెల్లిస్తూ రేకుల షెడ్డులో ఉండేవాళ్లం. మా కుటుంబానికి ప్రభుత్వం సెంటున్నర స్థలం ఇచ్చింది.ఇంటి నిర్మాణానికి డబ్బులు కూడా ఇచ్చింది. దీంతో ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. నాలుగు నెలల నుంచి ఇంటిలో నివాసం ఉంటున్నాం. సొంతింటి కల నెరవేరుతుందని కలలో కూడా ఊహించలేదు.చిరకాల స్వప్నం సాకారం కావడం చాలా సంతోషంగా ఉంది.

\- పైడిపాలెం లక్ష్మీదేవి, హౌసింగ్ లబ్ధిదారురాలు

అద్దె ఇళ్ల బాధలు తప్పాయి



చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం.సొంతంగా ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి. అద్దె ఇంటిలో ఉండే వాళ్లం. గతంలో అధికారులకు సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక స్థలం కేటాయించి, ఇల్లు కట్టించింది. ఐదు నెలల నుంచి సొంత ఇంటిలో నివాసం ఉంటున్నాం.అద్దె ఇళ్ల బాధలు తప్పినందుకు సంతోషంగా ఉంది.

\- అదప దుర్గా భవాని, హౌసింగ్ లబ్ధిదారురాలు

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుడం, చెవి నొప్పి, చెవిలో శబ్దాలు, కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, ముక్కు దూలం సరిచేయడం, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుడం, ముక్కులో బలపాలు, పూసలు తీయడం, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయడం, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రాని వారికి చికిత్స, తలనొప్పి, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అడుగడుగునా నీరాజనం

- వైఎస్ అవినాష్‌రెడ్డి రోడ్ షోకు భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సింహాద్రిపురం: రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



లింగాల: వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



పులివెందుల: రోడ్ షోకు తరలివచ్చిన పార్టీ శ్రేణులు

పులివెందుల రూరల్ / టౌన్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పులివెందుల పట్టణంలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా పులివెందులలో రోడ్ షో నిర్వహించారు. కడప పాత బస్టాండు దగ్గర వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ముస్లిం సోదరులు గజమాలలతో, డప్పు వాయిద్యాల మధ్య, బాణాసంచాలు పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. రోడ్ షోలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వేముల మండల ఇన్‌చార్జి ఈసీ దినేష్‌రెడ్డి, లింగాల మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి, పులివెందుల మండల ఇన్‌చార్జి చవ్వా దుష్యంత్‌రెడ్డి, వైఎస్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. రోడ్ షోలో వైఎస్ కుటుంబ సభ్యులకు జనం నీరాజనం పలికారు. కడప రోడ్డు నుంచి పాతబస్టాండు, పూలఅంగళ్ల మీదుగా ముద్దనూరు రోడ్డు వరకు రోడ్ షో నిర్వహించారు. అనంతరం పులివెందుల మండలంలోని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పార్టీ జెండాలు పట్టుకుని బైకు ర్యాలీ నిర్వహించారు. రోడ్ షోకు పులివెందుల మండల, మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రోడ్ షోలో డీఎస్‌ఆర్ యువసేన ఆధర్యంలో డేనియల్, పులివెందులకు చెందిన పార్టీ కార్యకర్తలు దారిపొడుగునా 5వేల టెంకాయలు కొట్టారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్‌సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగెళ్ల సాంబశివారెడ్డి, బయపురెడ్డి, బలరామిరెడ్డి, అజ్జగుట్ట భాస్కర్‌రెడ్డి, మరక శివకృష్ణారెడ్డి, పుష్పనాథరెడ్డి, సర్వోత్తమరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వరయ్య, ఎర్రబల్లె జగన్ పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : లింగాల కుడికాలువ నుంచి లింగాల చెరువుకు, లింగాల చెరువు నుంచి వనంబావి చెరువుకు రూ.5.20కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వెల్లడించారు. లింగాల మండలంలో ఒక అంబకపల్లె గ్రామానికి మాత్రమే తాగునీటి సమస్య ఉందన్నారు. లింగాల మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ వైఎస్ అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ లింగాల మండలం వైఎస్సార్ కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో సింహాద్రిపురం, లింగాల వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అరవిందనాథ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ జాఫర్, సర్పంచ్ రామ్మోహన్ లింగాల మండల కన్వీనర్ పివి సుబ్బారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రనాథరెడ్డి, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు రామాంజులరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, జిల్లా యూత్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



5వేల టెంకాయలను కొడుతున్న ఎంపీ అభిమానులు



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న యూత్ నాయకులు



రోడ్ షోలో పాల్గొన్న వైఎస్ కుటుంబ సభ్యులు

వైఎస్సార్‌సీపీకి ఏపీ ఎమ్మార్పీఎస్ మద్దతు



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఏపీ ఎమ్మార్పీఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని ఏపీఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలోని వైఎస్ పాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సభాధ్యక్షులు కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన మాదిగల ఆత్మీయ రాజకీయ మేల్కొలుపు సదస్సుకు దండు వీరయ్య మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ చట్టబద్ధత కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. 2014–2019 ఎన్నికల్లో అధికారం వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని మాదిగ ఉపకులాలకు ఇచ్చిన మాట బీజేపీ నిలబెట్టుకోలేదన్నారు. మరో కమిటీ పేరుతో పీఎం నరేంద్రమోదీ వర్గీకరణను కాలయాపన చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. మాదిగలకు మేలు చేసే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, మాదిగలకు మేలు జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీటీసీ ఎల్లయ్య, మాదిగ డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి బాలలక్ష్మయ్య, ఎంసీఈఎఫ్ కన్వీనర్ శివరాం, జిల్లా ఉపాధ్యక్షులు తిరుమలయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి పుల్లయ్య, అంబకపల్లి అంజి, బాలు, మహేష్, భార్గవ, శ్రీరాములు, రవి, శివ, తేజ, శ్రీను, గంగులయ్య, ముడుగంట్ల రామకృష్ణ, మదూరు మహేష్, ఈశ్వరయ్య, గంగరాజు, వేణు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



కె.ఎర్రగుడిలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేయాలని కోరుతున్నా వైఎస్ రాహుల్‌రెడ్డి



కల్లూరుపల్లెలో ప్రచారం చేస్తున్న ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి

చక్రాయపేట : సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుదామని మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తనయుడు వైఎస్ రాహుల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని కె.ఎర్రగుడి, బీఎస్ తాండా, గరుగుతాండా,బీసీ కాలనీ, ముద్దప్పగారిపల్లె,పెడమలవాండ్లపల్లె,హరిజనవాడల్లో, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రబాబుకు వలంటీర్ల భయం పట్టుకొని పింఛన్లు ఇంటి వద్దకు రానీయకుండా అడ్డుకొని అందరినీ ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి జగనన్నను, అవినాష్‌రెడ్డి అన్నను గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ హరిశేఖర నాయుడు,,మండల ఉపాధ్యక్షుడు వేదమూర్తి, మండల యూత్‌కన్వీనర్ రామాంజనేయరెడ్డి, నేతలు రఘురామిరెడ్డి, మధుసూధనరెడ్డి, అంజలిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, ప్రభాకరరెడ్డి, రామచంద్ర నాయుడు, రామచంద్రనాయక్, తిరుపాల్‌నాయక్, సుధాకరరెడ్డి, మురళి, శీనునాయక్, ప్రభాకర నాయక్, భీమానాయక్ పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో

మారెళ్లమడక గ్రామంలోని గండి క్షేత్రంలో బుధవారం వైఎస్ కొండారెడ్డి సతీమణి వైఎస్ ధనలక్ష్మి ఇంటింటా ప్రచారం నిర్వహించి జగనన్నను, అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌నరసింహులు, శ్రీరామమూర్తి, ప్రతాప్, సుజాత, చంద్ర, తదితరులు పాల్గొన్నారు

చంద్రబాబుది బూటకపు మేనిఫెస్టో..నమ్మొద్దు

చక్రాయపేట : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో ఒట్టి బూటకమని దానిని నమ్మి ఓట్లేసి ఎవరూ మోసపోవద్దని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని అద్దాలమర్రి, కుమార్లకాల్వ, ఎర్ర బొమ్మనపల్లె, కె.రాజుపల్లె, కె.ఎర్రగుడి, కల్లూరుపల్లె, నెరుసుపల్లె, సురభి గ్రామాల్లో ప్రచారం నిర్వాహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.కల్లూరుపల్లెలో మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు రైతులకు రుణమాఫీ, అక్కచెల్లెమ్మల బంగారు రుణాలను విడిపిస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన విషయం ఒక్క సారి గుర్తుకు తెచ్చుకోవాలని చెప్పారు. కరోనాలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారిని గాలికి వదిలి హైదరాబాద్‌లో దాక్కున్న వ్యక్తి చంద్రబాబు అన్నారు. కరోనాతో రాష్ట్రం అతలాకుతలం అవుతూ.. ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తున్నా లెక్కచేయక ప్రజల కోసం కష్ట పడటమే కాకుండా సంక్షేమ పథకాలతో ప్రజలను, అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు తీయించిన జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే అందరికీ మేలు జరగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బయ్యారెడ్డి,ఈశ్వరరెడ్డి,జగన్ మోహన్ రెడ్డి, రాంబాబు, కొండారెడ్డి,చెన్నారెడ్డి, ఉత్తమారెడ్డి, జగదీశ్వరరెడ్డి,సభాపతి నాయుడు, రామ భద్రప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్సీపీలో చేరిక



పులివెందుల: పార్టీలో చేరిన వారితో వైఎస్ మనోహర్‌రెడ్డి



వేముల: పార్టీలోకి చేరిన వారితో డాక్టర్ ఈసీ దినేష్ రెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి

పులివెందుల : పట్టణంలోని స్థానిక రోటరీపురంలో ఉన్న సుమారు 10 కుటుంబాలు బుధవారం బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం అహర్నిశలు కృషి చేస్తూ రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలు సంతోషంగా ఉన్నారని, మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అంకాలమ్మగుడి చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల మండలంలో..

వేముల : మండల కేంద్రమైన వేములలో టీడీపీకి చెందిన 20 కుటుంబాలు బుధవారం వైఎస్‌ఆర్ సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివరెడ్డి. జెడ్పీటీసీ కె వెంకట బయపరెడ్డిల ఆధ్వర్యంలో వెంకటరమణారెడ్డి చిన్న కొండారెడ్డి నారాయణరెడ్డి వెంకట్రామిరెడ్డి దస్తగిరి రామ్మోహన్ వరప్రసాద్ థామస్ నారాయణస్వామి ఖాదర్ వలీ, చంద్ర, లావణ్య, శారద, ఆదిలక్ష్మి, ప్రభావతి, విజయ్ శ్రీ లు పార్టీలో చేరారు. వీరికి ప్రముఖ వైద్యులు ఈసీ దినేష్ రెడ్డి కండువా చేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎంపీ అవినాష్ రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ రామ సుబ్బారెడ్డి రాఘవ రెడ్డి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

సింహాద్రిపురం : ఈదురుగాలులు, వర్షంతో మంగళవారం సింహాద్రిపురం మండలం లోమడ, తదితర గ్రామాల్లో అరటి పంట దెబ్బతింది. లోమడ గ్రామానికి చెందిన కత్తి నరసింహారెడ్డి అనే రైతు 7 ఎకరాల్లో సాగుచేసిన 8500 అరటి చెట్లు గాలులకు నేలకూలాయి. దీంతో రూ.14లక్షలు నష్టం వాటిల్లింది. అలాగే విద్యుత్ స్తంభం కూలి పుల్లయ్య ఇంటి మీద పడింది. భారీ వృక్షం కూడా కూలడంతో ఇళ్లు పూర్తిగా దెబ్బతింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. అధికారులు దెబ్బతిన్న పంటను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

లింగాల మండలంలో..

లింగాల : లింగాల మండలం రామన్నూతనపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు అరటి తోటలు నేలకొరిగాయి. గ్రామానికి చెందిన కటిక నీలుడు అనే రైతుకు చెందిన 3వేల అరటి చెట్లు గెలలతో ఉండగా కూలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోతున్నాడు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో అరటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ విషయమై రైతులు లింగాలలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ముందుగా ప్రాథమిక విచారణ నిర్వహించి పంటనష్టం అంచనాలు వేయిస్తామన్నారు. నష్టపరిహారం ప్రభుత్వం ద్వారా అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు.



ఈదురుగాలులకు నేలకూలిన అరటి పంట

క్లుప్తంగా

పోలైన 47 పోస్టల్ బ్యాలెట్లు

మైదుకూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బుధవారం 47 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలోని ఉద్యోగుల కోసం ఆది, సోమవారాల్లో స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన పోలింగ్‌లో పలువురు పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకున్నారు. మిగిలిన వారికి మంగళవారం నుంచి మున్సిపల్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం 47 మంది పీఓ, ఏపీఓ, ఓపీఓ, ఎంఓలు, పోలీసు సిబ్బంది, ఆఫీసు సిబ్బంది, బీఎల్‌ఓలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వలంటీర్ల రాజీనామా

గోపవరం : మండలంలోని గోపవరం సచివాలయం పరిధిలోని శ్రీనివాసపురం, గోపవరం, సంగసముద్రం గ్రామాల్లో పనిచేస్తున్న 8 మంది వలంటీర్లు బుధవారం తమ పదవులకు రాజీనామా చేశారు.

రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి విజయకుమార్‌కు ఇవ్వగా.. ఆయన ఎంపీడీఓ రాధాకృష్ణన్‌కు అందజేశారు. రాజీనామా పత్రాలను ఆమోదిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తాము వలంటీర్లుగా పనిచేసి పార్టీలు, కులాలకు అతీతంగా ప్రజలకు సేవ చేశామన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో జగన్ కోసం మా వంతు సహాయ సహకారాలు అందించడంతో పాటు తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు వలంటీర్ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం స్వచ్ఛందంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం


కాశినాయన : అక్కంపేటలో ప్రచారం చేస్తున్న నల్లేరు విశ్వనాథరెడ్డి


బి.కోడూరు : పాయలకుంట్లలో ప్రచారం చేస్తున్న ఆదిత్యరెడ్డి


బద్వేలు అర్బన్ : లక్ష్మీపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా రంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అభ్యర్థించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులోని మహమ్మద్‌కాలనీ, టెలికాం ఎంప్లాయిస్ కాలనీ, మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీలోని లక్ష్మీపాలెంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి రహిత సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, పోలిరెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, కుప్పాలరమణ, గంగమ్మ, గానుగపెంట ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నివిధాల అండగా ఉంటాం

అట్లూరు : టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వారికి అన్నివిధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టరు సుధ భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నరసారెడ్డితో పాటు అట్లూరు చెండువాయికి చెందిన మరో పది కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే సుధ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోవిళ్ల చిన్న సూరారెడ్డి, ఇరగంరెడ్డి భాస్కర్‌రెడ్డి, పొన్నలు బ్రహ్మానందరెడ్డి, రాజారెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని కుంభగిరి సచివాలయం పరిధిలోని జీ.కొత్తపల్లె, ఎస్సీకాలనీ, ఎస్టీ కాలనీలలో బుధవారం అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ రొండామాధవరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రచారం చేశారు.

జగనన్నను గెలిపించండి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టామని ఎన్‌ఆర్‌ఐ గల్ఫ్ శాఖ అధ్యక్షుడు ఇలియాజ్, కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి పేర్కొన్నారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్ర బుధవారం అట్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధను నర్సారెడ్డి ఇంట్లో కలసి ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్రలో వివరించామని తెలిపారు. భాస్కర్‌రెడ్డి, డీలర్ కృష్ణారెడి పాల్గొన్నారు.

కలసపాడు : ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధ, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం మండలంలోని మామిళ్లపల్లె, కరణంవారిపల్లె, మహబూబ్‌నగర్ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తారాజశేఖర్‌రెడ్డి, దేవసాని శ్రీనివాసులరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సింగరయ్య, పి.ఈశ్వర్‌రెడ్డి, బి.రమణారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పాలన సాగిస్తూ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా లభించిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అమగంపల్లె నుంచి


అట్లూరు: ఎన్‌ఆర్‌ఐ గల్ఫ్ నాయకులతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ


కలసపాడు : మామిళ్లపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసాపురం వరకు రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాలు పథకాల ద్వారా పేద ప్రజలకు ఆర్థికంగా ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే అని కొనియాడారు. నాడు–నాడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి సాంకేతికతతో కూడిన విద్యను అందించారని ప్రశంసించారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పేదలకు ఏనాడు మంచి చేయలేదని విమర్శించారు. పలు గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించండి

ఈ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వైఎస్‌అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామంలో ప్రచారం నిర్వహించారు. జేసీఎస్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, స్థానిక సర్పంచ్ రాములమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.గురివిరెడ్డిపాల్గొన్నారు.

మళ్లీ ఆశీర్వదించండి .. అభివృద్ధి చేస్తాం

బి.కోడూరు : ఈ నెల 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధ, ఎంపీ అభ్యర్థి వైఎస్‌అవినాష్‌రెడ్డిలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని దేవసాని ఆదిత్యరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం బి.కోడూరు మండలంలోని పాయలకుంట్ల పంచాయతీ పంచాయతీలోని రామచంద్రాపురం, మాధవరాయునిపల్లె గ్రామాల్లో ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, సర్పంచ్ నరసమ్మ, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ యోగానందరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.సుబ్బారెడ్డి, వెంకటరామయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సాయంత్రం ప్రభలవీడు, నరసయ్యకొట్టాలు, తిప్పరాజుపల్లె గ్రామాల్లో సర్పంచ్ జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కె.తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, బి.కోడూరు సర్పంచ్ మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సంజీవరెడ్డి, బిల్లా, వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, కె.నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నవరంలో ఎన్నికల ప్రచారం

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. జేసీఎస్ కన్వీనర్ రామోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి గెలిపించాలని ఓటర్లను కోరారు.

పతి కోసం సతి ప్రచారం

చాపాడు : మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని గెలిపించాలని ఆయన కుటుంబీకులు బుధవారం పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి ప్రభావతమ్మ బుధవారం సాయంత్రం సాయంత్రం మండలంలోని ఓబుళరెడ్డిపేట, పెద్దగురువశూరు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇదే క్రమంలో ఎమ్మెల్యే మనుమడు శెట్టిపల్లె సాకేత్‌రెడ్డి మండలంలోని వెదురూరు పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తు పై ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుళరెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.


చాపాడు: ఓబుళరెడ్డిపేటలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి ప్రభావతమ్మ

మామ కోసం కోడళ్ల ప్రచారం

మైదుకూరు : ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కోడళ్లు మైదుకూరు మున్సిపాలిటీలో ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం పట్టణంలోని పదవ వార్డు పరిధి సర్వాయిపల్లెలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కోడళ్లు శెట్టిపల్లె కవితారెడ్డి, శెట్టిపల్లె విష్ణు ప్రియారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీగా వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యేగా శెట్టిపల్లె రఘురామిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలోసంక్షేమ పాలన కొనసాగాలంటే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఓటర్లకు తెలిపారు.


మైదుకూరు : ఓటును అభ్యర్థిస్తున్న శెట్టిపల్లె కవిత రెడ్డి, శెట్టిపల్లె విష్ణుప్రియారెడ్డి

తాత కోసం మనుమళ్ల ప్రచారం

దువ్వూరు : మైదుకూరు అసెంబ్లీ అభ్యర్థి శెట్టిపల్లె రఘురామిరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మనవళ్లు శెట్టిపల్లె కార్తీక్‌రెడ్డి, శెట్టిపల్లె సాకేత్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. బుధవారం మండలంలోని భీమునిపాడు, సంగటి తిమ్మాయపల్లె గ్రామంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ప్రచారం చేశారు. ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఇరగం రెడ్డి శంకర్‌రెడ్డి, స్థానిక నేతలు వెంకటేశ్వరరెడ్డి, కుప్పన్నగారి నాగసుధారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆనందరావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ జేష్టాది రవికుమార్, పోలు రవీంద్రుడు, గంధం ఓబులేసు, మేడా నరసింహులు, చిలంకూరు రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోగటం వీరారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, సంగన హరినాథరెడ్డి, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, పుత్తా శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.


దువ్వూరు : ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శెట్టిపల్లె సాకేత్ రెడ్డి

చేరికల హోరు.. వైఎస్సార్‌సీపీ జోరు

బ్రహ్మంగారిమఠం : టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు కొనసాగుతోంది. మండలంలోని నాగిశెట్టిపల్లె పంచాయతీ ఆరోగ్య నగర్‌కు చెందిన 30 ఎస్సీ సామాజికవర్గానికి కుటుంబాలు టీడీపీ నుంచి బుధవారం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి,మండల పార్టీ ఇన్‌చార్జి మేకల రత్నకుమార్‌యాదవ్. రాము, ఎస్.నాగేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకడు నిత్యపూజారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేశారు. పార్టీలో చేరిన వారిలో నాగిపోగు బాలరాజు, బాలస్వామి, సురేష్, మండల బాలయ్య, గంజికుంట బాలగురవయ్య, రవి, వినోద్, జోజయ్య, తదితర కుటుంబాల వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మదుసూధన్‌రెడ్డి, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన వార్డు మెంబర్ మహబూబ్ సుబహాని ఆధ్వర్యంలో టింగిరిరఫి, జిలాని, కమాల్‌బాషా, చాంద్‌బాషా, యక్కలూరి సంజీవరాయుడు, అంబవరం రామిరెడ్డిలతో పాటు మరో 10 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ బద్వేలు నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు.


బి. మఠం మండలం నాగిశెట్టిపల్లెలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో నాయకులు

దువ్వూరు : దువ్వూరుకు చెందిన తోట నడిపి గుర్రప్ప, తోట సుబ్బారావు, తోట శంకర్, సీటీ ప్రతాప్‌సింగ్‌లతో పాటు అనుచరులు 20 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు సొసైటీ ప్రెసిడెంట్ ఇరగంరెడ్డి విశ్వనాథరెడ్డి, పీపీ రమణయ్య నాయుడు, కొర్రపాటి వెంకటసుబ్బయ్య, లింగం పట్టాభి, చిరాకి గౌస్ బాషా పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

చాపాడు : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు కోరారు. మండల కేంద్రమైన చాపాడులోని వైఎస్ కల్యాణ మండపంలో బుధవారం ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి అధ్యక్షతన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరగాలన్నారు. దీని కోసం ఎన్నికల నిర్వహణ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడిన నమోదయ్యే కేసుల వలన ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉత్పన్నం అవుతాయన్నారు. రూరల్ సీఐ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నాయకులు సామరస్యంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిర్వహణలో భాగంగా క్రిమినల్స్‌ను ప్రోత్సహించరాదన్నారు. ఇలాంటి ఘటనల వలన సామాన్య, పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసుల లక్ష్యమని రూరల్ ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలైన తిరువెంగళాపురం, ఎత్తిరాజుపల్లె, వల్లెరవారిపల్లె, మడకలవారిపల్లె గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్, ఎస్ఎస్‌బీ కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో భయాందోళనలను పోగొట్టి వారు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు భరోసా కల్పించడం కోసం ఈ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశులు


తిరువెంగళాపురంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఎలాంటి ఘటన జరిగినా బాధ్యులు మీరే

బ్రహ్మంగారిమఠం: సార్వత్రిక ఎన్నికలలో ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎలాంటి ఘటనలు జరిగినా అందుకు రాజకీయ పార్టీల నాయకులు బాధ్యత వహించాలని మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం సాయంత్రం బి.మఠం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో ఎన్నికలు ప్రశాతంగా జరిగే విధంగా చూసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసినట్లు ఫిర్యాదులు అందితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఐ విద్యాసాగర్, మండలంలోని వివిధరాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

చాపాడు : మండల వ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులలో కూడిన వర్షం కురిసింది. రాత్రి 10.30గంటల ప్రాంతంలో ఒక్క సారిగా ఈదురు గాలులు మొదలయ్యాయి. ఇదే క్రమంలో పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపులు రావటంతో పాటు భారీ వర్షం మొదలైంది. గంటకు పైగా భారీ వర్షం కురిసింది. గాలుల దాటికి మండలంలోని వివిధ ప్రాంతాలలో చెట్లు పడిపోగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇదే క్రమంలో మండలంలోని గుంతచీపాడు గ్రామంలో కురిసిన అధిక వర్షం కారణంగా బుధవారం తెల్లవారుజామున గోర్ల పెద్ద తిరుపాల్ అనే వ్యక్తికి చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న జయచంద్ర అనే వ్యక్తి గాయపడ్డాడు. ఈ ప్రమాదం వలన రూ.2లక్షల మేరకూ ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. మండలంలోని 61.0 మి.మీ వర్ష పాతం నమోదైనట్లు తహసీల్దారు వై.భూషణం తెలిపారు.

భారీ వర్షం

పోరుమామిళ్ల : మండలవ్యాప్తంగా మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రాత్రి 11 గంటల నుంచి 12 గంటల వరకు భారీ వర్షం పడింది. ఈదురు గాలులకు ముందస్తుగా విద్యుత్ అధికారులు కరెంట్‌ను నిలిపివేశారు.

70 ఎకరాల్లో అరటిపంటకు నష్టం

కాశినాయన : మండలంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఈదురుగాలులతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఆకులనారాయణపల్లె గ్రామంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు విద్యుత్ స్తంభం కూడా నేలకొరిగింది. పలు గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈదురుగాలులకు మండలంలో దాదాపు 70 ఎకరాల్లోని అరటిపంట నేలకొరిగింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.